క్లుప్తంగా

అయోధ్య అక్షింతలకు పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సోమల: అయోధ్య అక్షింతలకు స్థానిక యోగాభి రామాలయంలో సోమవారం ఆలయ అర్చకుడు రామరత్నం శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అలాగే ఆలయంలోని సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ విగ్రహాలకు పంచామృతాభిషేకం చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

పుంగనూరు: పట్టణంలోని ధోబీ కాలనీకి చెందిన విజయలక్ష్మి భర్త వేణు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమెకు వైఎస్సార్ బీమా పథకం కింద లక్ష రూపాయల చెక్కును మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండవీటి నరేష్, శ్రీనివాసులు, రవితేజారెడ్డి, మురళి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలి



చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

రొంపిచెర్ల: అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎంపీడీఓ రాజేంద్ర, ఎంఈఓ శ్రీనివాసులు కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 19న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్యవర్గం.. ఏకగ్రీవం




నరసింహారెడ్డి, షానవాజ్

రొంపిచెర్ల: మండల ఎస్టీయూ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్టీయూ చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ యూనియన్ ఆర్థిక కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడిగా ఓ.నరసింహారెడ్డి, గౌరవాధ్యక్షులుగా మునిరత్నం, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మహమ్మద్ షానవాజ్ బాషా, ఆర్థిక కార్యదర్శిగా గంగాధరయ్య, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.లోకనాధరెడ్డి, ఆర్.కృష్ణయ్య, పి.రమణా రెడ్డి, డి.యల్లప్ప, పి.రవి శేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

క్రీడాకారులకు టీషర్టులు



క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలో పాల్గొనే క్రీడాకారులకు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం టీషర్టులను ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి పంపిణీ చేశారు. ఒక్కొక్క సచివాయం పరిధిలో 114 మందికి వీటిని ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాదముని రెడ్డి, సర్పంచ్ రాణెమ్మ, ఎంపీడీఓ రాజశేఖర్, ఎంఈఓ సిద్ధరామయ్య, నాయకులు రవీంద్రా రెడ్డి, దామోదర్, ఆనందరెడ్డి కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి



బాలచంద్రరాజు

పుత్తూరు: తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాలిఫోర్నియా సిలికానాంధ్ర యూనివర్సిటీ అధ్యక్షుడు సి.బాలచంద్రరాజు కోరారు. వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సరేంద్ర రచించిన భావతరంగాలు, అడవిమల్లి కవితా సంపుటిని ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని తెలిపారు. విదేశాలకు వెళ్లినా మాతృభాషపై మక్కువ తగ్గలేదన్నారు. తెలుగు భాషాభివృద్ధి కోసం పలు దేశాల్లో సిలికానాంధ్ర మనబడి యూనివర్సిటీ సేవలు అందిస్తోందని వివరించారు. పలు దేశాల్లో ఎన్ఆర్ఐలు తమ పిల్లలకు తెలుగు భాష నేర్పించడానికి ఇష్టపడుతున్నట్లు చెప్పారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. అనంతరం బాలచంద్రరాజును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

చెరువులను చెరబట్టారు

- యథేచ్ఛగా బంకమట్టి తవ్వకాలు
- ఇటుకల బట్టీలు, వెంచర్లకు విక్రయం
- పట్టించుకోని అధికారులు



గంగవరం మండలం జంబొద్దు కుంటలో జేసీబీలు, ట్రాక్టర్లతో బంకమట్టిని తరలిస్తున్న దృశ్యం

పలమనేరు: నియోజకవర్గంలోని చెరువుల్లో యథేచ్ఛగా బంకమట్టి తవ్వకాలు సాగుతున్నాయి. ఇటుకల తయారీకి కొందరు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు మరికొందరు బంకమట్టిని జేసీబీలతో తోడి, ట్రాక్టర్లకు నింపి తరలిస్తున్నారు. లోడు బంకమట్టి రూ.600 నుంచి రూ.800 వరకూ పలుకుతోంది. దీంతో కొందరికి ఇది కాసులు కురిపిస్తోంది. ట్రాక్టర్ల యజమానులకు నిత్యం పనులు దొరకడంతో అద్దె తక్కువైనా చెరువుల్లో మట్టి తరలించే పనులకు ఆసక్తి చూపుతున్నారు. అధికారులకు ఇది తెలిసినా చెరువులపై దృష్టి సారించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

రెండు విధాలా లాభం

కౌండిన్య నదిలో నీళ్లు ఉండడంతో ఇసుక తోడేందుకు వీలు కావడం లేదు. దీంతో కొందరు నదికి ఆనుకుని ఉన్న రైతుల భూములను లక్షల్లో ఇచ్చి ఇసుకను మాత్రం తోడుకుని అమ్ముకుంటున్నారు. మరికొందరు నదికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇసుకను తోడేస్తున్నారు. ఇకొందరు చెరువులపై పడ్డారు. తొలుత చెరువు పైభాగంలోని బంకమట్టిని ఇటుకల తయారీకోసం విక్రయిస్తున్నారు. దానికింద ఉంటున్న ఇసుకను తోడేస్తున్నారు. నియోజకవర్గంలో 110 దాకా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,700 దాకా చిన్నపాటి చెరువులున్నాయి. వీటిల్లో సగం దాకా చెరువుల్లో నీరు తగ్గింది. ఇదే అవకాశంగా చేసుకుని బంకమట్టిను తవ్వేవాళ్లు ఎక్కువయ్యారు. వీరికి బంకమట్టితో పాటు అదనపు లాభంగా ఇసుక లభిస్తోంది. దీంతో వీరి వ్యాపారం మూడు బంకమట్టి లోడ్లు, ఆరు ఇసుక ట్రాక్టర్లగా మారింది.

ఇదిగో సాక్ష్యం

నియోజకవర్గంలోని గంగవరం మండలం మేలుమాయి పంచాయతీ సామరాజుపల్లె సమీపంలోని జంబొద్దు చెరువులో కొందరు నెల నుంచి బంకమట్టిని జేసీబీలతో తోడేసి తరలిస్తున్నారు. ఇప్పటికే ఈ చెరువులో వెయ్యిలోడ్లకు పైగా బంకమట్టిని తరలించినట్టు అక్కడి గ్రామస్తులు చెప్పారు. దీంతో చెరువులోని ఒండ్రుమట్టి పోయి, వర్షాలకు వరదనీరు చెరువులో ఇంకిపోతుందని చెబుతున్నారు. అలాగే, మండల కేంద్రమైన బైరెడ్డిపల్లె పెద్దచెరువులో ఆరునెలలుగా బంకమట్టిని తోడేస్తున్నారు. ఇక్కడ నాలుగైదు జేసీబీలు, పది ట్రాక్టర్లు నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి. ఈ చెరువులో 5వేల లోడ్ల మట్టిని ఇప్పటికే మాయం చేశారు. వాస్తవానికి మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ముందే బంకమట్టి ట్రాక్టర్లు వెళుతున్నా తమకేం సంబంధం లేనట్లు సంబంధిత అధికారులు వ్యవహరిస్తుండటం గమనార్హం!

అధికారులది తలో దారి!

చెరువులకు బాధ్యులైన ఇరిగేషన్ అధికారులను దీనిపై ప్రశ్నిస్తే తమకు చెరువు కట్టల మరమ్మతులు మాత్రమే చూస్తామని బంకమట్టి తరలింపు వ్యవహారాలతో తమకు సంబంధం లేదని చెప్పారు. ఇక, రెవెన్యూ శాఖ కూడా తమదో దారి అన్నట్లు వ్యవహరిస్తోంది. అది మండల పరిషత్ కార్యాలయం చూసుకుంటుందని, తమకేమీ సంబంధం లేదని చెబుతోంది. ఎంపీడీఓ కార్యాలయ అధికారులను సంప్రదిస్తే.. అది పంచాయతీ కార్యదర్శులు చూసుకుంటారని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా బంకమట్టిని తరలించే అక్రమార్కులు సంబంధిత కార్యదర్శుల అండతో ఎవరైనా ప్రశ్నిస్తే తాము వైఎస్సార్‌సీపీ నాయకుల అనుచరులమని చెప్పి దందాలు చేయడం కనిపిస్తోంది. దీనిపై కనీసం జిల్లా స్థాయి అధికారులైనా స్పందించాలని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు.

జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు



గ్రామస్తులతో చర్చిస్తున్న ఎస్ఐ సుమన్

శాంతిపురం: నిబంధనలకు విరుద్ధంగా జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాళ్లబూదుగూరు ఎస్ఐ సుమన్ హెచ్చరించారు. అబకలదొడ్డిలో జల్లికట్టుకు ఏర్పాట్లు చేస్తున్నారనే సమాచారంతో సోమవారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. స్థానికులతో మాట్లాడారు. జల్లికట్టు నిర్వహించరాదని హితవు పలికారు. కొందరు గ్రామస్తులను బైండోవర్ చేసుకుని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కొలేష్ ముందు హాజరు పరచి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ త్యాగరాజు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్లు, డైరీ ఆవిష్కరణ



చౌడేపల్లె: స్థానిక విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో సోమవారం ఎస్టీయూ–2024 డైరీ, క్యాలెండర్లను ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు లింగమూర్తి, రమణయ్య, సుధాకర్ నాయుడు, మోహన్, నాగరాజ, పురుషోత్తం, తులసి, రవీంద్ర, శ్రీనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో ఇబ్బంది

కుప్పం: కారుమబ్బులు.. చిరుజల్లులు..చలిగాలులతో కుప్పం ప్రాంత ప్రజానీకం ఇబ్బంది పడుతోంది. సోమవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తూ చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో రాకపోకలపై ప్రభావం చూపింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మొక్కలు నాటుతున్న పెద్దిరెడ్డి

సదుం: ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచ్

పులిచెర్ల(కల్లూరు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతో ఈ పరిమితికి సంబంధించి వచ్చిన ఆరోగ్యశ్రీ కొత్త కార్డులను సోమవారం కల్లూరులో స్థానిక సర్పంచ్ షకూర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీటీసీ రెడ్డి అహమ్మద్, ఉపసర్పంచ్ ఎస్ఎస్ కిషోర్, కల్లూరు ఈఓ యుగంధర్, సచివాలయ కన్వీనర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ



పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలో మార్కెట్లు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పక్కగా చేయాలని నగర కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో, సోమవారం ఉదయం నగరంలో చేస్తున్న పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. కొంగారెడ్డిపల్లె, చర్చి వీధిలోని కూరగాయల మార్కెట్లు, ఫిష్ మార్కెట్లను తనిఖీ చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో దుకాణదారులు, వ్యాపారులు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయకుండా చెత్త తరలించే వాహనాలకు ఇవ్వాలని సూచించారు. మార్కెట్ల వద్ద, ప్రధాన సర్కిళ్లు, రద్దీ ప్రాంతాల్లో రోజూ చెత్తను తరలించాలని చెప్పారు. ఇందుకోసం అవసరమైన సిబ్బందిని సమకూర్చుకొని పనులు చేయాలని ఆదేశించారు. ఎక్కువ వ్యర్థాలను వెలువరించే హోటల్స్, మాల్స్, ఇతర సంస్థలను సమన్వయం చేసుకుని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. సహాయ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీచర్ మృతి

బంగారుపాళెం: చిల్లగుండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ స్వరూపరాణి(59) ఆదివారం రాత్రి హఠాన్మరణం చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చిత్తూరులోని నివాసంలోనే అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి వెళ్లి వైద్యం పొంది తిరిగివచ్చారు. ఇంటికి చేరుకున్న కొంత సేపటికి గుండెపోటుకు గురై మృతి చెందినట్లు తెలిపారు. గత జూన్‌లో బదిలీపై ఆమె వచ్చారు.

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు

చౌడేపల్లె: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకంటే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఆయన ప్రభుత్వాన్ని రాబోవు ఎన్నికల్లోనూ మళ్లీ ఆశీర్వదించాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అంజిబాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని ఆమినిగుంట, పెద్దయల్లకుంట్ల, కొండయ్యగారిపల్లె, చింతమాకులపల్లె, గ్రామ పంచాయతీల్లో స్వయం సహాయక సంఘాల మహిళలకు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రామమూర్తి తో కలిసి ఆయన మాట్లాడారు. పసుపు–కుంకుమ, రుణాల మాఫీ హామీలతో గత ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలను వంచించారని, మళ్లీ ఎన్నికల నేపథ్యంలో మరోసారి ప్రజలను బురిడీ కొట్టించేందుకు ఆయన ఇస్తున్న హామీలను ప్రజలెవరూ నమ్మరాదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఇళ్ల ముంగిటకే అందిస్తున్న సేవల గురించి వివరించారు. పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, జెఏసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్‌భరత్, సర్పంచులు సావిత్రమ్మ, రఘురామిరెడ్డి, అనూరాధ, హైమావతి, ఎంపీటీసీలు శ్రీరాములు, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు అవకాశం ఇవ్వండి



మహిళలకు చీరలు అందజేస్తున్న దుర్గ

కుప్పం రూరల్: స్థానికంగా ఉండి ప్రజల బాగోగులు చూసుకునే వారికి రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాలని ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని అడవిబూదుగూరు పంచాయతీలోని ఎర్రగుట్టచేను, వినాయకపురం, శాముడమ్మవంక, కడసీకొట్టాలు, ఓటికుంటచెరువు, సప్పానికుంట గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు పసుపు, కుంకుమ, చీర అందజేసి వారి ఆశీస్సులు పొందారు. ఆమె మాట్లాడుతూ, ఎక్కడో హైదరాబాద్‌లో నివాసం ఉండే వారిని కాకుండా స్థానికంగా కాపురం ఉంటే వ్యక్తులకు మద్దతు ఇస్తే ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. కరోనా సమయంలోనూ తమ కుటుంబం కుప్పంలో ఉండి ప్రజలకు సేవ చేసిన విషయం గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, స్థానికులు రమేష్, చిదంబరం తదితరులు పాల్గొన్నారు.

దేశ చరిత్రలో ఇదే ప్రథమం

- 5,221 మందికి పట్టాలు పంపిణీ చేయడం గర్వంగా ఉంది
- సీఎం జగన్, టీటీడీ చైర్మన్ భూమనకు రుణపడి ఉంటామన్న టీటీడీ ఉద్యోగులు



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డిని సన్మానిస్తున్న చీర్ల కిరణ్, టీటీడీ ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): తిరుమల–తిరుపతి దేవస్థానంలో పని చేస్తున్న 5,221 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వడం భారతదేశంలోనే ఎక్కడా జరగలేదని, ఇది ఒక చరిత్ర అని టీటీడీ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ అన్నారు. సోమవారం మహతి ఆడిటోరియంలో టీటీడీ ఉద్యోగులకు రెండో విడత ఇంటి పట్టాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. టీటీడీ ఉద్యోగులు మాట్లాడుతూ తమ పాతికేళ్ల ఇంటి స్థలాల కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డిని జీవితంలో మరువమన్నారు. టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు, టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు భూమనను గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం చీర్ల కిరణ్ మాట్లాడుతూ అహర్నిశలు శ్రమించి ముఖ్యమంత్రిని ఒప్పించి, మెప్పించి, టీటీడీ ఉద్యోగుల కలను భూమన సాకారం చేశారని, ఆయనకు తాము జీవితాంతం కృతజ్ఞులుగా ఉంటామన్నారు. గతవారం మొదటి విడతలో 3,518 మందికి, మహతి ఆడిటోరియంలో రెండోవిడతలో ఇప్పుడు 1,703 మందికి టీటీడీ చేతుల మీదుగా ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేయడంతో ఉద్యోగులకు సంక్రాంతి పండుగ 10 రోజుల ముందే వచ్చినట్లుందన్నారు.

అతి త్వరలో మూడో విడత..

మూడో విడత అతి త్వరలో ఉంటుందని, వెంకటగిరి రోడ్డులోని ఐఐటీ వద్ద దాదాపు 350 ఎకరాలలో ప్రస్తుతం మిగిలి ఉన్న ఉద్యోగులకు, రిటైర్డ్, మరణించిన ఉద్యోగులకు దాదాపు 4000 మందికి ఇంటి స్థలాలు ఇవ్వబోతున్నారని తెలిపారు. అందుకు గానూ టీటీడీ పాలకమండలి రూ.87.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ మహాయజ్ఞాన్ని ముందుండి నడిపిస్తున్న చైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి, సహకరించిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏవీ ధర్మారెడ్డికి, టీటీడీ ఉన్నతాధికారులకు, అధికారులకు టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, టీటీడీ ఉద్యోగులందరి తరఫున కృతజ్ఞతలు అన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రంగా నాయక్, హేమలత, ఇ.సునీల్ కుమార్, శ్రీహరి, రేఖ, కొప్పర్తి శివ, అశోక్ కుమార్, విశ్వనాథం, శ్రీనివాసరావు, పెరుమాళ్, చిన్ని, కేశవులు, వంకీపురం పవన్, మణికంఠ, గంట భరత్, ధరణి కుమార్, పూల హరికృష్ణ, రూప్ సాగర్, అంకయ్య, జల్లా శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లలో ముందస్తు సంక్రాంతి



పులిచెర్ల: కల్లూరు హైస్కూల్లో సంక్రాంతి ముగ్గులు



రామకుప్పం: భోగి మంట చుట్టూ టీచర్లు, విద్యార్థులు

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లి ఎంపీయూపీ పాఠశాలలో హెచ్ఎం బాబు రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ, విద్యార్థులు మన సంస్కృతీ సంప్రదాయాలను విస్మరించరాదన్నారు. పండుగల ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. విద్యార్థుల హరిదాసు వేషధారణ, సాంస్కృతిక ప్రదర్శన, అమ్మాయిల గొబ్బెమ్మ పాటలు చూపరులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ముందు భోగి మంటలు వేసి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, మాధవన్, ఆంజప్ప, రాజేష్, బాబు, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బగళనత్తంలో..

రామకుప్పం: మండలంలోని బగళనత్తం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు రంగులతో వివిధ రకాల ముగ్గులను వేశారు. అందులో గొబ్బెమ్మలను పెట్టి పాటలు పాడారు. భోగి మంటలను వేశారు. గాలిపటాలను ఎగురవేశారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు దేవకుమార్, కృష్ణమూర్తి, రాధాబాబు, మోహన కుమారి పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలో సూర్యనగర్‌లోని కృష్ణారెడ్డి శ్రీచైతన్య పాఠశాలలో సంక్రాంతి ముందస్తు సంబరాలు సోమవారం ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి, భోగిమంటలు వేశారు. అలాగే గోపూజ చేశారు. పశువులకు అరటిపండ్లు, పొంగలి పెట్టారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక శ్రీ షిర్డీసాయి ప్రైమరీ పాఠశాలలో కరస్పాండెంట్ విజయనిర్మల ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు సాంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. నృత్యాలు, గొబ్బెమ్మలు, ఆటపాటలతో సందడి చేశారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు వేశారు. ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు వెంకట సిద్ధులు, రాజేంద్ర, రాజశేఖర్, ప్రకాష్, స్నేహమాలిని, విమలా విక్టోరియా, పద్మవేణి తదితరులు పాల్గొన్నారు.



పెద్దపంజాణి: ముందస్తు సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, టీచర్లు



పుంగనూరు: గోపూజ చేస్తున్న విద్యార్థులు, పాఠశాల బృందం



చౌడేపల్లె: సాంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు